తైక్వాండో అకాడమీ ప్రారంభం



ముకుల్‌ తైక్వాండో అకాడమీని ప్రారంభిస్తున్న ఆరికెపూడి గాంధీ తదితరులు

శేరిలింగంపల్లి: విద్యార్థులకు చదువులతో పాటు మార్షల్‌ ఆర్ట్స్‌ వంటి వాటిలో శిక్షణ తీసుకోవాలని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, పీఏసీ చైర్మన్‌ ఆరికెపూడి గాంధీ సూచించారు. చందానగర్‌ గంగారంలో ఏర్పాటు చేసిన ముకుల్‌ తైక్వాండో అకాడమీని ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ.. తైక్వాండో వంటి అకాడమీల వల్ల చిన్నారుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను గుర్తించేందుకు అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌ నాయకులు రఘునాథ్‌రెడ్డి, బాలింగ్‌ గౌతమ్‌ గౌడ్‌, లక్ష్మారెడ్డి, మోహన్‌ ముదిరాజ్‌, శ్రీనివాస్‌ నాయక్‌ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా 2కే రన్‌



2కే రన్‌ను ప్రారంభిస్తున్న జోనల్‌ కమిషనర్‌

శేరిలింగంపల్లి: తెలంగాణ ప్రభుత్వ ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా జీహెచ్‌ఎంసీ శేరిలింగంపల్లి జోన్‌ ఆధ్వర్యంలో 2 కే రన్‌ను ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని శేరిలింగంపల్లి జోనల్‌ కమిషనర్‌ ఉపేందర్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. యువత నిత్యం వాకింగ్‌, వ్యాయామం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి డిప్యూటీ కమిషనర్‌ పి.ముకుంద్‌రెడ్డి, ఈఈ దుర్గాప్రసాద్‌, ఏఎంసీలు శ్రవణ్‌ కుమార్‌రెడ్డి, ప్రేమ్‌ కుమార్‌, సంజయ్‌, ప్రాజెక్టు ఆఫీసర్‌ మల్లీశ్వరీ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు



రాయదుర్గం: రాయదుర్గంలోని ఊరపోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆదివారం అమ్మవారికి పూజలు, అర్చనలు, అభిషేకాలు, ప్రత్యేక అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా బస్తీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులు అమ్మవారికి నిమ్మకాయలతో తయారు చేసిన హారాన్ని సమర్పించుకున్నారు. ఆలయంలో ప్రతి ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

ప్రజా సేవ చేసే వారికి గుర్తింపు ఖాయం



స్మైల్ డెంటల్‌ ఆస్పత్రి ప్రారంభోత్సవంలో మంత్రి దామోదర రాజనర్సింహ, కార్పొరేటర్‌ గంగాధర్‌రెడ్డి

రాయదుర్గం: ప్రజాసేవ చేసే వారికి గురింపు రావడం ఖాయమని రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖా మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. గోపన్‌పల్లి తాండలో స్మైల్ డెంటల్‌ ఆస్పత్రిని కార్పొరేటర్‌ గంగాధర్‌రెడ్డితో కలిసి ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నాణ్యమైన వైద్యాన్ని అందరికీ అందుబాటులోకి తీసుకొచ్చి సేవలందించాలన్నారు. స్మైల్ డెంటల్‌ ఆస్పత్రిని ప్రారంభించడం ఆనందంగా ఉందని, వైద్య బృందాన్ని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్‌ ఎస్‌ అరుణ్‌తేజ, ప్రజాప్రతినిధులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ దరఖాస్తుల పరిశీలన



మణికొండ: ఇందిరమ్మ గృహాలకు దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను ఆదివారం మణికొండ మున్సిపాలిటీ పరిధిలో అధికారులు, సిబ్బంది పరిశీలించారు. మున్సిపల్‌ కమిషనర్‌ ప్రదీప్‌కుమార్‌, మేనేజర్‌ శ్రీధర్‌ వార్డుల వారీగా నియమించిన కమిటీల పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో ప్రజాపాలనలో భాగంగా దరఖాస్తు చేసుకున్న వారందరినీ తమ సిబ్బంది కలుస్తారన్నారు. వారు అడిగిన సమాచారం ఇచ్చి సిబ్బందికి సహకరించాలని కోరారు. అర్హులైన వారిని గుర్తించి ప్రభుత్వానికి నివేదిక పంపుతామన్నారు.

నేడు ప్రజావాణి

రాజేంద్రనగర్‌: రాజేంద్రనగర్‌ సర్కిల్‌ కార్యాలయంలో సోమవారం(నేడు) ప్రజావాణి నిర్వహించనున్నట్లు ఉప కమిషనర్‌ రవికుమార్‌ తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉంటుందన్నారు. రాజేంద్రనగర్‌, అత్తాపూర్‌, మైలార్‌దేవ్‌పల్లి, సులేమాన్‌నగర్‌, శాస్త్రిపురం డివిజన్లకు చెందిన ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ సమస్యలపై ఫిర్యాదు చేసి పరిష్కరించుకోవాలన్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన



కళాకారులు కూచిపూడి నృత్య ప్రదర్శనతో సందర్శకులను ఆకట్టుకున్నారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం పద్మావతి ఆర్ట్‌ అకాడమీ, సూత్ర ఇనిస్టిట్యూట్‌ ఆఫ్‌ ఫైన్‌ ఆర్ట్స్‌ గురువు కార్తీక్ కిరణ్‌ శిష్యబృందంచే కూచిపూడి నృత్యప్రదర్శన సందర్శకులను ఆకట్టుకుంది. ఇందులో మోదమున, వినాయకకౌతం, పుష్పాంజలి, హిమగిరితనయే, కొలువై ఉన్నదే, జతిస్వరం, దశావతారం, పలుకే బంగారమాయెనా, థిల్లాన తదితర అంశాలను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. కళాకారులు వేదం, సహస్ర, జాహ్నవి, శ్రీ అంవిత, పర్ణిక, లక్ష్మి, అభిష్ట, లక్ష్మి అక్షిత, లలిత శీరిష, హస్య పద్మావతి తదితరులు పాల్గొన్నారు. -మాదాపూర్‌



ట్రాన్స్‌ కో.. జర దేఖో!

ప్రధాన రహదారులు, నడి రోడ్లపై ఉన్న విద్యుత్‌ స్తంభాలు ప్రమాదాలకు నిలయాలుగా మారాయి.. నిత్యం స్థానిక పాదచారులు, వాహనదారులు వాటి పక్కనుంచే రాకపోకలు సాగించాల్సి ఉండడంతో భయాందోళనకు గురవుతున్నారు. ప్రధాన అంతర్గతరోడ్లపై కూలిపోయేలా స్తంభాలు ఉన్నా సంబంధిత అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం ఏంటని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తారానగర్‌ ప్రధాన రహదారి మధ్యలో, చందానగర్‌ మంజీరా రోడ్డు పక్కన, చందానగర్‌ పీజేఆర్‌ స్టేడియం నుంచి తారానగర్‌ పోచమ్మ దేవాలయం రోడ్డులో తదితర ప్రాంతాల్లో ఉన్న స్తంభాలు ఓ వైపునకు ఒరిగి ఎప్పుడు కూలుతాయోనని అటుగా రాకపోకలు సాగించే వారు భయాందోళనకు గురవుతున్నారు. ఈ విషయమై పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోతుందని, ఉన్నతాధికారులు స్పందించి ప్రమాదకరంగా మారిన స్తంభాలను తొలగించి కొత్తవి ఏర్పాటు చేయాలని ఆయా ప్రాంతాల వారు కోరుతున్నారు. -శేరిలింగంపల్లి



తారానగర్‌ ప్రధాన రోడ్డులో ప్రమాదకరంగా స్తంభం



చందానగర్‌ మంజీరారోడ్డులో ఇలా..

తారానగర్‌ పోచమ్మ దేవాలయానికి వెళ్లే రోడ్డులో ఒరిగిన స్తంభం



దైవచింతనతో మానసిక ప్రశాంతత



హనుమాన్‌ చాలీసా పారాయణంలో పాల్గొన్న భక్తులు

న్యాయవాది రమాదేవి

పటాన్‌చెరు టౌన్‌: దైవ చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని న్యాయవాది రమాదేవి అన్నారు. ఆదివారం డివిజన్‌ పరిధిలోని రామలింగేశ్వర దేవస్థానంలో ఏర్పాటు చేసిన హనుమాన్‌ చాలీసా పారాయణ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. భక్తులతో కలిసి హనుమాన్‌ చాలీసా పారాయణం చేశారు. అనంతరం న్యాయవాది రమాదేవి మాట్లాడుతూ...దేవాలయాలకు వచ్చే భక్తులు సంప్రదాయ దుస్తులు ధరించాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల్లో దేశభక్తి, భక్తిభావాన్ని పెంపొందించాలన్నారు. కార్యక్రమంలో వివేకానంద సేవ సమితి జిల్లా అధ్యక్షుడు శేషాద్రి, పటాన్‌చెరు అసెంబ్లీ బీజేపీ కన్వీనర్‌ శ్రీనివాస్‌ గుప్తా, జగన్‌రెడ్డి, ప్రవీణ్‌ బజరంగదళ్‌, జిల్లా సహ ప్రాముక్‌ మనోజ్‌, అర్చకులు మహేష్‌, గణేశ్‌ పాల్గొన్నారు.

కాలనీల్లో స్పీడ్‌ బ్రేకర్లు ఏర్పాటు చేయండి



ఆందోళన చేస్తున్న కాలనీలవాసులు

మణికొండ: కాలనీల్లో వాహనాలు వేగంగా దూసుకొచ్చి ఢీ కొడుతుండటంతో ప్రాణాలు పోతున్నాయని, ఈ విషయాన్ని ప్రజాప్రతినిధులు, అధికారులకు చెప్పినా పట్టించుకోవటం లేదని పలు కాలనీల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని చింతచెట్టు(బటర్‌ఫ్లై) సర్కిల్‌ సమీపంలో ఆదివారం రోడ్డుపై ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పాయినీర్‌ ఎస్టేట్‌, ఈవీవీ కాలనీ, స్పెక్ట్రం విల్లాస్‌, లాగూన్‌ విల్లాస్‌, ఫెయిర్‌ ఫీల్డ్‌ కాలనీలకు చెందిన వారు మాట్లాడారు. తమ కాలనీల ప్రవేశంలో ఇప్పటికే అనేక రోడ్డు ప్రమాదాలు జరిగాయన్నారు. ఓ బాలుడు మృతి చెందటంతో పాటు అనేక మందికి గాయాలయ్యాయన్నారు. అదే విషయాన్ని ప్రజాప్రతినిధులు, మున్సిపల్‌ అధికారులకు ఫిర్యాదులు చేయగా మున్సిపల్‌ కమిషనర్‌ స్పీడ్‌ బ్రేకర్ల ఏర్పాటు పనులను ప్రారంభిస్తే స్థానిక ఓ కౌన్సిలర్‌ పనులను నిలిపివేయించారన్నారు. స్పీడ్‌ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని, లేదంటే జిల్లా కలెక్టర్‌తో పాటు రాష్ట్ర ప్రభుత్వ పెద్దలను కలుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌.రవీందర్‌రెడ్డి, జి.రామ్మోహన్‌, రాజేంద్రప్రసాద్‌, కిషోర్‌, ఉస్మాన్‌, శ్రీకాంత్‌, వంశీ, షాబుద్దీన్‌, అజీజ్‌, రవికుమార్‌, కార్తీక్‌, సూర్యరాణి పాల్గొన్నారు.

సెంట్రింగ్‌ ధరలు పెంచాలి



సమావేశమైన కాంట్రాక్టర్లు

మైలార్‌దేవ్‌పల్లి: నిర్మాణ రంగంలో సరైన ధరలు లేక సెంట్రింగ్‌ గుత్తేదారులు నష్టాలు చవి చూస్తున్నారని మైలార్‌దేవ్‌పల్లి సెంట్రింగ్‌ యూనియన్‌ అధ్యక్షులు మల్లేష్‌ అన్నారు.ఆదివారం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌ దుర్గానగర్‌లోని సెంట్రింగ్‌ యూనియన్‌ కార్యాలయంలో నిర్వహించిన కాంట్రాక్టర్ల సమావేశంలో నూతన యూనియన్‌ పాలకవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మల్లేష్‌ మాట్లాడుతూ..భవన రంగంలో సెంట్రింగ్‌ ధరలు నాలుగేళ్ల నుంచి పెరగలేకపోతున్నాయని అన్నారు. వచ్చే ఏడాది నుంచి ధరలను పెంచాలని సెంట్రల్‌ కమిటీ వారికి విన్నవించుకున్నామని అన్నారు. కాంట్రాక్టర్లు ఐక్యంగా ఉంటే సెంట్రింగ్‌ ధరలు పెంచడానికి ఆస్కారం ఉంటుందని సూచించారు. ఉపాధ్యక్షుడిగా శంకరయ్య, ప్రధాన కార్యదర్శిగా వెంకటేష్‌, సహాయ కార్యదర్శులుగా దేవప్ప, కోశాధికారిగా బాల్‌రాజ్‌, ఆర్గనైజింగ్‌ కార్యదర్శులుగా అశోక్‌, ధన్‌రాజ్‌, శంకర్‌, శేఖర్‌, సలహాదారులుగా దర్శన్‌, యాదగిరి, సింహాద్రి, రమేష్‌, శ్రీనివాస్‌ రెడ్డి, రమేష్‌ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

మియాపూర్‌ పోలీస్‌ స్టేషన్‌ సమాచారం	
ఇన్‌స్పెక్టర్‌ క్రాంతి కుమార్‌	-9490617129
క్రైమ్‌ డీఐ అక్రమ్‌ బాబా	-8331013218
క్రైమ్‌ ఎస్‌ఐ మల్సూర్‌	-8712663177
ఎస్‌ఐ వెంకటేశ్వర్లు	-8712568310
ఎస్‌ఐ నర్సింహారెడ్డి	-8712568331
ఎస్‌ఐ రాజేశ్వర్‌రెడ్డి	-8712568213
ఎస్‌ఐ చంద్రయ్య	-8712568233
ఎస్‌ఐ మాణిక్యం	-8712568151
పెట్రోల్‌ మొబైల్‌	- 8333993414, 8333993415

వర్గీకరణకు సహకరించండి



సురేందర్‌

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఎస్సీ వర్గీకరణను వెంటనే చేపట్టాలని బీహెచ్‌ఈఎల్‌ ఎస్సీ ఎంప్లాయిస్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు సురేందర్‌ డిమాండ్‌ చేశారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం వెనుకబడిన కులాలకు రిజర్వేషన్‌ కల్పించిందన్నారు. గత 30ఏళ్లుగా మంద కృష్ణ మాదిగ షెడ్యూల్డ్‌ కులాల్లో ఉన్న 59 ఉపకులాలకు న్యాయం జరగాలని అందుకు ఎస్సీ వర్గీకరణ జరగాలని పోరాటం చేస్తున్నారని తెలిపారు. ఇటీవల సుప్రీంకోర్టు సైతం వర్గీకరణ చేసుకోవచ్చాని తీర్పు ఇవ్వడంపై సంతోషం వ్యక్తం చేశారు. అందరికీ న్యాయం జరిగేలా వర్గీకరణకు సహకరించాలని కోరారు.

చాకలి ఐలమ్మను ఆదర్శంగా తీసుకోవాలి



విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌

మణికొండ: దొరల పెత్తనాన్ని ఎదిరించి బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలిచిన వీరనారి చాకలి ఐలమ్మ అని, మహిళలు ఆమె అడుగు జాడల్లో నడవాలని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ అన్నారు. నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని కోకాపేటలో ఆదివారం రజక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఆయన ముదిరాజ్‌ కార్పొరేషన్‌ చైర్మన్‌ జ్ఞానేశ్వర్‌ ముదిరాజ్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చాకలి ఐలమ్మ రజాకార్లను తరమికొట్టిన వీర వనితని, దొరలు ఆక్రమించిన భూములపై సాయుధ పోరాటం చేసి వారిని గడగడలాడించిందన్నారు. మనకు ఎలాంటి సేవలు చేయని వారికన్నా ఇలాంటి ఆదర్శంగా నిలిచే వారి విగ్రహాలను ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జైపాల్‌రెడ్డి, అశోక్‌యాదవ్‌, వేణుగౌడ్‌, విజయ్‌బాబు, కృష్ణ, మల్లేష్‌, పాపిరెడ్డి పాల్గొన్నారు.

నంబర్‌ ప్లేట్‌ లేకపోతే చర్యలే



మణికొండ: వాహనాలకు నంబర్‌ ప్లేట్‌ లేకపోతే చర్యలు తప్పవని నార్సింగి ట్రాఫిక్‌ ఎస్సై రాజేశ్‌గౌడ్‌ అన్నారు. ఆదివారం నార్సింగి సర్కిల్‌లో నంబర్‌ ప్లేట్‌ లేని, అక్షరాలు కనబడని వాహనాలపై ప్రత్యేక డ్రైవ్‌ నిర్వహించి పట్టుబడిన 20 ద్విచక్ర వాహనాలకు చలాన్‌లు విధించి కౌన్సెలింగ్‌ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లా డుతూ మరోసారి నిబంధనలు ఉల్లంఘిస్తే వాహనాలను సీజ్‌ చేయటంతో పాటు యజమానులపై కేసులు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై చందర్‌, కానిస్టేబుళ్లు సురేష్‌, లక్ష్మణ్‌ పాల్గొన్నారు.

రోడ్లపై అడ్డదిడ్డంగా పార్కింగ్‌



రోడ్డుపై నిలిపిన భారీ వాహనాలు

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మండలం పారిశ్రామికవాడలోని ప్రధాన రహదారులపై ని త్యం భారీ వాహనాలు పార్కింగ్‌ చేస్తున్నారని స్థాని కులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బొంతపల్లి పా రిశ్రామికవాడలోని పరిశ్రమల ముందు భాగంలో రోడ్డుపైనే ట్యాంకర్లు, లారీలు వరుసగా పార్కింగ్‌ చేస్తుండడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నా యని స్థానికులు వాపోయారు. గ్రాండ్యువల్స్‌ పరిశ్రమ ఎదుట నిత్యం భారీ వాహనాలు పార్క్‌ చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యంతో రాత్రి వేళల్లో పరిశ్రమల నుంచి విధులు ముగించుకొని వెళ్తున్న కార్మికులు, వాహనదారులు ప్రమా దాలకు గురవుతున్నారని స్థానికులు చెబుతున్నా రు. ఈ వ్యవహారంపై జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

మణికొండ: పుట్‌పాత్‌లపై చలితో ఇబ్బందులు పడుతున్న వారికి మణికొండ వీఆర్‌ఫర్‌యు సంస్థ ప్రతినిధులు దుప్పట్లను పంపిణీ చేశారు. శనివారం, రాత్రి ఆదివారం మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని దేవాలయాలు, బసవతారకం, సరోజిని ఆసుపత్రులతో పాటు రోడ్ల పక్కన పడుకున్న వారికి దుప్పట్లను అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు బాపూజీ మాట్లాడుతూ.. తమ సంస్థ ఆధ్వర్యంలో గత 9 ఏళ్ల నుంచి అనేక సేవా, సామాజిక కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సీతారాందాస్‌, నాగేంద్రరావు, ప్రదీప్‌రావు, ప్రభావతి, విజయలక్ష్మి, శివరామకృష్ణ పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

ఆల్విన్‌కాలనీ: ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పీఏసీ చైర్మన్‌, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. హైదర్‌నగర్‌ డివిజన్‌ పరిధిలోని నందమూరి నగర్‌ కాలనీలోని కమ్యూనిటీ హాల్‌లో మెడికోవర్‌ హాస్పిటల్‌ సౌజన్యంతో ఆదివారం బిగ్‌ టీవీ ఆధ్వర్యంలో ఉచిత మెగా మెడికల్‌ క్యాంప్‌ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించి మాట్లాడారు. కాలనీ వాసులకు, పరిసర ప్రాంత పేద, మధ్య తరగతి ప్రజలకు ఉచిత పరీక్షలు నిర్వహించి వైద్య సేవలు అందించడం అభినందనీయమన్నారు. శిబిరంలో రక్త పరీక్షలు, జనరల్‌, దంత వైద్యం, బీపీ, షుగర్‌, గైనకాలజీ, ఆర్థో, ఈసీజీ, ఈఎన్‌టీ వంటి పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో సంజీవరెడ్డి, ఎండీ ఇబ్రహీం, అష్రాఫ్‌, యాసిన్‌, సదా మహేష్‌, జుబేదా బేగం, విమల, స్వప్న, బిజన్‌, పర్వీన్‌ బేగం, సంగన్న, మహ్మద్‌ ఖురేషి, వైద్య సిబ్బంది, కాలనీ వాసులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విధానాలతో సంక్షోభంలో కార్మిక రంగం



మాట్లాడుతున్న నిర్మల్‌ పాండే

శంషాబాద్‌: ప్రభుత్వాల తీరుతోనే వ్యవసాయ కార్మిక రంగం సంక్షోభంలోకి నెట్టబడుతోందని భారతీయ బీకేయూఎం జాతియ కార్యదర్శి నిర్మల్‌ పాండే అన్నారు. ఆదివారం జరిగిన వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్రస్థాయి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశ వ్యాప్తంగా వ్యవసాయ కార్మికుల్లో కులమతాల చిచ్చురేపడంతో వారి ఐక్యతను దెబ్బ తీస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వ పాలనలో మైనార్టీలు, దళితులు, గిరిజనులపై దాడులు పెరుగుతున్నాయన్నారు. బీకేయూఎం ద్వారా దేశ వ్యాప్తంగా పోరాటలను ఉద్ధృతం చేస్తామన్నారు. ఈ నెల 27 కలెక్టరేట్‌ల వద్ద నిర్వహించనున్న ధర్నాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో లింగారెడ్డి, సృజన్‌ కుమార్‌, యేసయ్య, బుద్దుల జంగయ్య, పుస్తకాల నర్సింగ్‌రావు, అంజయ్య, నర్సగిరి పాల్గొన్నారు.

నూతన పాలకవర్గం ఎన్నిక

పటాన్‌చెరు: డివిజన్‌ పరిధిలోని కృషి డిఫెన్స్‌ కాలనీలో ఆదివారం నూతన పాలకవర్గాన్ని ఏకగ్రీవంగా ఎనుకున్నారు. కాలనీ అధ్యక్షుడిగా అమరేందర్‌, జనరల్‌ సెక్రటరీ కె.ఎన్‌ జనార్దన్‌, టెజర్రర్‌గా జోషి కుమార్‌ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమానికి పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌ రెడ్డి, కార్పొరేటర్‌ మెట్టుకుమార్‌ యాదవ్‌ హాజరై శుభాకాంక్షలు తెలిపారు. నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన అమరేందర్‌ మాట్లాడుతూ.. కాలనీలోని అన్నీ సమస్యలను అందరి సహకారంతో పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఎండీఆర్‌ ఫౌండేషన్‌ కో- కన్వీనర్‌ పృథ్వీ , చైర్మన్‌ రాఘవేందర్‌ రెడ్డి, కాలనీ మాజీ ప్రెసిడెంట్‌ మాణిక్య రెడ్డి, పాత పాలకవర్గం సభ్యులు పాల్గొన్నారు.



నూతన అధ్యక్షుడిని అభినందిస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్‌